వైద్య సిబ్బందికి రక్షణ అవసరం



ప్రజారోగ్య రంగంలో సేవలందిస్తున్న వారిలో 70 శాతం మహిళలే. ఆరోగ్యం విషమంగా ఉన్న కేసులు వచ్చేటప్పుడు వైద్య ఆరోగ్య సిబ్బందికి ఒత్తిళ్లు తప్పవు. కొనిసార్లు పేషెంట్ బంధువులే కాకుండా బయటి వ్యక్తులు కూడా గుంపులుగా వచ్చి కావాలనే గొడవలకు దిగుతారు. ఫొటోలు, వీడియోలు తీసి బెదిరిస్తుంటారు. వైద్య సిబ్బందికి రక్షణ అవసరం. వైద్య ఆరోగ్య సిబ్బందిని రక్షించేందుకు ప్రత్యేక చట్టాలు చేయాలి. దాడులకు పాల్పడే వారికి వెంటనే శిక్షలు అమలు చేయాలి.

– సీహెచ్ నీరజ, హెడ్‌నర్స్, కేజీహెచ్



పటిష్ట భద్రత కల్పించాలి



రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే వైద్యులు, వైద్య సిబ్బందికి పటిష్ట భద్రత కల్పించాలి. సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలి. రాత్రి సమయాల్లో ఇబ్బంది కలగకుండా తగినంత సెక్యూరిటీ పెంచాలి. సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటే ఎటువంటి అఘాయిత్యాలు జరగకుండా ఉండే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం పూర్తి భద్రత కల్పిస్తే వైద్యులు, వైద్య సిబ్బంది ధైర్యంగా విధులు నిర్వహించగలుగుతారు.

– పి.భవానీ, ఏఎన్ఎం, కొబ్బరితోట యుపీహెచ్‌సీ

క్లుప్తంగా

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం



మోహన్‌రావు కుమారుడు సుధాకర్‌కు ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ 36వ వార్డులో మృతి చెందిన కుందేటి మోహన్‌రావు దహన సంస్కారాలకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు మాసిపోగు రాజు, పార్టీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి, మోహన్‌రావు కుమారుడు కుందేటి సుధాకర్ ద్వారా సమాచారం తెలుసుకున్న వాసుపల్లి మోహన్‌రావు భౌతిక దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి భరోసా కలిగించారు. ఈ కార్యక్రమంలో కోన శంకర్, వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీఎంఆర్‌డీఏ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్



టీ షర్ట్‌లు ఆవిష్కరిస్తున్న వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం స్పోర్ట్స్ మీట్ 2024 నిర్వహించారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలు ప్రారంభించారు. వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ వి.రవీంద్ర, ముఖ్య గణాంకాధికారి హరి ప్రసాద్, డివిజనల్ ఫారెస్టు అధికారి శాంతి స్వరూప్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా 'బాలబాట' వార్షికోత్సవం



బాదంగీర్ సాయిని సత్కరిస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార : ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బాలల మాసపత్రిక బాలబాట 17వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత, నేషనల్ బుక్ ట్రస్ట్ దక్షిణ ప్రాంత అధికారి డాక్టర్ పత్తిపాక మోహన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ బాలబాట పదహారేళ్ల ప్రస్థానాన్ని వివరించారు. అనంతరం రమణమ్మ రచించిన 'పూలమాల' (పిల్లల నాటికలు), కల్లేపల్లి స్వర్ణలత రచించిన 'స్నేహ దివ్వెలు', ఆచార్య సీతా రత్నం రచించిన 'ఐసన్ యాత్ర' పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. తర్వాత బాదంగీర్ సాయి, కల్లేపల్లి స్వర్ణలతను సత్కరించారు. ఆకాశవాణి కార్యనిర్వహణాధికారి బి.రామసూర్య ప్రకాశరావు, గరిమ సాహితీ సంస్థ అధ్యక్షుడు కె.నరసింహ పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయాలు నెరవేరుద్దాం

మురళీనగర్: స్వామి వివేకానందుడి ఆశయాలు ప్రజల్లోకి తీసుకెళ్లి, వాటి సాధనకు కృషి చేయాలని వివేకానంద యువ మహా మండలి అధ్యక్షుడు పి.మునిస్వామి పిలుపునిచ్చారు. విశాఖ వివేకానంద యువ మహామండలి వార్షిక సమావేశాన్ని మురళీనగర్ ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఎక్కువగా సభ్యులుగా చేరేలా చైతన్యపరచాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణలో యువ మహామండలి నూతన శాఖలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

భయపెడుతున్న భవంతి

- కెప్టెన్ రామారావు జంక్షన్‌లో కూలిపోయేందుకు సిద్ధంగా మూడంతస్తుల భవనం
- ఖాళీ చేయాలని చెప్పినా వినని దుకాణదారులు
- కోర్టు కేసు పేరుతో జాప్యం
- తక్షణమే తొలగించాలని స్థానికుల డిమాండ్



కెప్టెన్ రామారావు జంక్షన్‌లో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న మూడంతస్తుల బిల్డింగ్

అల్లిపురం: స్థానిక కెప్టెన్ రామారావు జంక్షన్‌లో మూడంతస్తుల బిల్డింగ్ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఇది మరో ప్రమాదానికి కారణం కానుందా అని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో కూలుతుందో అని గుప్పిట ప్రాణాలు పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కెప్టెన్ రామారావు జంక్షన్ నిత్యం రద్దీగా ఉంటుందని, పగటి పూట ప్రమాదం చోటు చేసుకుంటే భారీ స్థాయిలో ప్రాణ నష్టం జరిగే అవకాశం లేకపోలేదని భావిస్తున్నారు. ఈ మేరకు బిల్డింగ్ యజమాని టి.లక్ష్మణరావును వివరణ కోరగా తాను ఇప్పటికే ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోయానని తెలిపారు. మొదటి, రెండు అంతస్తులు ఖాళీ చేసి అద్దెకున్న వారిని కూడా ఖాళీ చేయించానని తెలిపారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో గల దుకాణాల యజమానులను ఖాళీ చేయమని చెప్పినా ఖాళీ చేయకపోగా కోర్టులో కేసు వేశారన్నారు. కోర్టు కూడా ఖాళీ చేయాలని ఆదేశించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో బిల్డింగ్ కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, కూల్చేందుకు అనుమతులు కావాలని జీవీఎంసీని కోరగా వారు దుకాణదారులకు నోటీసులు కూడా ఇచ్చారని తెలిపారు. పోలీస్ కంప్లయింట్ ఇచ్చినా కూడా వారు ఖాళీ చేయటం లేదని తెలిపారు. ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళనగా ఉందన్నారు. కోర్టు కేసులో నెగ్గినప్పటికీ దుకాణదారులు అప్పీలుకు వెళ్లడంతో జీవీఎంసీ అధికారులు ఏమీ చేయలేకున్నారని తెలిపారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే ఇటువంటి నిర్మాణాల పట్ల కోర్టు మానవతా దృక్పథంతో కూల్చివేతకు అనుమతించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎప్పుడేం జరుగుతుందో తెలియదు..



పాత భవంతి వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఆందోళనగా ఉంది. రోడ్డుపై వెళ్తుంటే ఎప్పుడు కూలుతుందో అని భయంగా ఉంటుంది. ఇంటి యజమానికి కూడా చాలాసార్లు చెప్పాం. ఆయన కూడా తన వంతుగా నోటీసులు ఇచ్చానని చెబుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే తగిన చర్యలు తీసుకుంటే మంచిది.

–బొడ్డు పోలారావు, కెప్టెన్ రామారావు జంక్షన్

నోటీసులు ఇచ్చాం..



బిల్డింగ్ ప్రమాదకరంగా మారింది. అందుకే మేము ఖాళీ చేసి వెళ్లిపోయాం. షాపు యజమానులకు నోటీసులు ఇచ్చాం. కానీ వాళ్లు పట్టించుకోలేదు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. జీవీఎంసీ అధికారులకు కూడా తెలిపాం. వారు ఖాళీ చేస్తే బిల్డింగ్ పడగొట్టేందుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఎటువంటి ప్రమాదం జరగక ముందే ప్రభుత్వ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– టి.లక్ష్మణరావు, ఇంటి యజమాని

భూ బాధితుల సదస్సును జయప్రదం చేయాలి



సదస్సు పోస్టర్ ఆవిష్కరిస్తున్న మరుపల్లి పైడిరాజు తదితరులు

అల్లిపురం: భూకబ్జాదారుల కోరల్లో చిక్కుకున్న ప్రభుత్వ భూముల లావాదేవీలన్నీ రద్దు చేయాలని, పేదలు నివాసాలుగా ఏర్పాటు చేసుకున్న స్థలాలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న విజయవాడలో సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం అల్లిపురంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, జీఎస్‌జే అచ్యుతరావు, ఎస్‌కే రెహమాన్, సీఎస్ క్షేత్రపాల్, పి.చంద్రశేఖర్, జి. రాంబాబు, ఎస్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



గ్రంథాలయ కార్యవర్గ సభ్యులకు పుస్తకాలు అందజేస్తున్న ఆడారి కొండలరావు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టలో ఉన్న శ్రీ వెంకట గౌరీశంకర గ్రంథాలయానికి సీనియర్ జర్నలిస్టు ఆడారి కొండలరావు సుమారు రూ.20 వేల విలువ గల సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాహిత్య గ్రంథాలను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన వీచికలన్నారు. జ్ఞానం, విజ్ఞానం, పరిజ్ఞానాన్ని అందించే దేవాలయాలుగా కొనియాడారు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా మనిషికి మిగిలేది అజ్ఞానమే అన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చినిగిన చొక్కా అయిన వేసుకో, కానీ మంచి పుస్తకాన్ని వదులుకోకు అని రచయిత చలం అన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో విద్యార్థుల సత్తా



సాయికుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

దాబాగార్డెన్స్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫైనల్, సీఎంఏ ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ వైజాగ్ బ్రాంచ్ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించినట్టు బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్ అంజిరెడ్డి, అకడమిక్ ప్రిన్సిపాల్ దినేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన అభినందన సభలో వారు మాట్లాడుతూ సీఎంఏ ఇంటర్‌లో వైజాగ్ బ్రాంచ్ విద్యార్థులు కె. సంపత్‌కుమార్ 26వ ర్యాంకు, కె. హేమంత్ సాయి 32, జి. వెంకటరమణ 44, కె. చంద్రశేఖర్‌రావు 50వ ర్యాంకు సాధించారని తెలిపారు. అలాగే సీఎంఏ ఫైనల్ ఫలితాల్లో కె. సాయికుమార్ ఆలిండియా స్థాయిలో 15, ఆర్. అనూష 22, పి. సౌమ్య 39వ ర్యాంకు సాధించిందని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

21వ రోజుకి శ్రావణలక్ష్మి పూజలు



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మీ అమ్మవారు



విశేష హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు ఆదివారం 21వ రోజుకి చేరాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేదమంత్రాలు, నాద స్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు విశిష్ట శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొన్నారు. పరోక్షంగా పూజలు చేయదలచుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమచేసి వారి పేరు, గోత్ర నామం, చిరునామాను 8985515989 వాట్సప్ నెంబరకు పంపాలి. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో సమృద్ధిగా భూగర్భ జలాలు

సీతమ్మధార: ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు లేకుంటే భవిష్యత్తులో పెనుముప్పు తప్పదని సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ అధినేత సూరిబాబు తెలిపారు. జీవీఎంసీ గాంధీ పార్కులో ఆదివారం రెండో రోజు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇంకుడు గుంతల ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. అపార్టుమెంట్లు, వ్యక్తిగత నివాసాల్లో ప్రజలంతా విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు లేని పక్షంలో ఇంటి ప్లాన్ ఇవ్వకూడదని, అలాగే మున్సిపల్ కుళాయిలు మూడు నెలలు కట్ చేయాలని తెలిపారు. ప్రతి మూడు నెలలకి ఒకసారి గెలిచిన రాజకీయ నేతలు వారి నియోజకవర్గంలో ప్రజలకు ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

చోరీకి గురైన ద్విచక్ర వాహనం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ క్రైం ఎస్సై రామమూర్తి

దాబాగార్డెన్స్: చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని వన్‌టౌన్ పోలీసులు దొంగ నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వన్‌టౌన్ క్రైం ఎస్ఐ రామమూర్తి వివరాలు వెల్లడించారు. డాబాగార్డెన్స్‌లో గల ఓ ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలో పని చేస్తున్న కె. శ్యాంకుమార్ కళాశాల నర్సింగ్ విద్యార్థి అన్నెపు జితేంద్ర నుంచి వాహనం తీసుకుని కేజీహెచ్‌లో పని విషయమై ఈ నెల 20న వెళ్లాడని చెప్పారు. కేజీహెచ్‌లో పని చూసుకుని తిరిగి సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో బయటికి రాగా పార్కింగ్ చేసిన వాహనం కనిపించలేదన్నారు. మూడు రోజుల పాటు వెతికినా ఫలితం లేకపోవడంతో ఈ నెల 24న ఫిర్యాదు చేశాడని, ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ క్రైం పోలీసులు ఎస్. రామమూర్తి (డీఎస్సై), ఎ. శ్రీనివాసరావు (హెడ్ కానిస్టేబుల్), కానిస్టేబుళ్లు టి. దుర్గాప్రసాద్, ఇ. గౌరీ శంకర్, జి. రాజు వాహనాన్ని దొంగలించిన కె. గౌతం సాయిని వాహనంతో పట్టుకున్నారని తెలిపారు. నేరస్తుడు కె. గౌతం సాయి ఎన్ఏడీ గణేష్‌నగర్‌లో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నాడని, చెడు వ్యసనాలకు బానిసై, సంపాదన చాలక సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో దొంగతనాలకు అలవాటు పడ్డాడని పోలీసులు తెలిపారు. అతనిపై కంచరపాలెం, ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయని చెప్పారు. కేజీహెచ్‌లో చోరీకి పాల్పడిన యాక్టీవా (ఏపీ 39 ఎఫ్‌పీ 2088) ద్విచక్ర వాహనాన్ని వన్‌టౌన్ ఏరియా కోటవీధిలో గల స్క్రాప్ దుకాణం వద్ద అమ్మేందుకు వెళ్లాడని, ఎవరూ తీసుకోకపోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలో గల రాణి బొమ్మ జంక్షన్ వైపు వెళ్తుండగా పోలీసుల కంటపడ్డాడని తెలిపారు.

ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతమ్మధార: ప్రాథమిక విద్య మాతృభాషలోనే సాగాలని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. ఫోరం ఆధ్వర్యంలో డాక్టర్ లంకలపల్లి బుల్లయ్య కళాశాలలో ఆదివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో నగరానికి చెందిన విద్యావేత్తలు, భాషాభిమానులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం విద్యా విధానంపై ప్రకటన చేయాలని కోరారు. గాంధీ సెంటర్ అధ్యక్షుడు ఆచార్య వి.బాలమోహన్‌దాస్, డాక్టర్ సత్యమూర్తి, పి.కన్నయ్య, వేదుల కామేశ్వరరావు పాల్గొన్నారు.

కరుణించరావా.. దేవకీ నందనా

ఘనంగా ప్రారంభమైన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



జిల్లా పరిషత్ సమీపాన విద్యుత్ వెలుగుల్లో శ్రీకృష్ణ చైతన్య మఠం



రాధాకృష్ణులు

దాబాగార్డెన్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు పలు ప్రాంతాల్లో ఘనంగా ప్రారంభించారు. సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఈ నెల 27 వరకు పెద్ద ఎత్తున ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల మూడు రోజులు అర్చనలు, విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మాయాపూర్ భక్త బృందంచే హరే కృష్ణ మహామంత్ర సంకీర్తన, సాంబదాస్‌చే ప్రవచనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం ఉదయం 4.30 గంటలకు మంగళ హారతి, 9 గంటలకు దర్శన హారతి, దర్శనానికి విచ్చేసే భక్తులచే ఊంజల సేవ, సాయంత్రం 4 నుంచి చిన్నారులచే విచిత్ర వేషధారణ, యువతచే ఉట్టి కొట్టే సంబరం, సోలో, గ్రూపు డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నారు. రాత్రి 11 గంటలకు మందిరంలో బాలకృష్ణుడికి మహాభిషేకం, 108 దీపాలతో అఖండ మంగళ హారతి ఏర్పాటు చేశారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో..

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం 25, 26 తేదీల్లో బీచ్‌రోడ్డు ఎంవీపీ కాలనీలో గల గాదిరాజు పేలస్ వేదికగా, మధురవాడ, ఆనందపురం, భీమునిపట్నం భక్తుల సౌకర్యార్థం ఐఐఎం రోడ్డులో గల గంభీరం గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వేడుకగా నిర్వహించనున్నారు. 27న వ్యాసపూజ, నందోత్సవం ఏర్పాటు చేశారు. 108 మంది ప్రసిద్ధ సంగీత కళాకారులచే సామూహిక భజ గోవిందం కార్యక్రమం నిర్వహించనున్నారు. సోమవారం రాత్రి 9.30 గంటలకు మహా అభిషేకం, శ్రీకృష్ణుడు జన్మించిన సమయంలో రాత్రి 12 గంటలకు మహా మంగళ హారతి నిర్వహించనున్నారు. ఈ అభిషేకంలో సప్తనదుల (గంగ, యమునా, సరస్వతి, గోదావరి, నర్మదా, సింధు, కావేరి) నుంచి సేకరించిన జలాలు, 108 పవిత్ర జల కలశాలు, పళ్ల రసాలు, పంచామృతం, పంచగవ్యాలు, వివిధ రకాల పుష్పాలతో మహాభిషేకం నిర్వహించనున్నారు.

శ్రీకృష్ణ చైతన్య మఠంలో..

నగరంలోని జిల్లా పరిషత్ సమీపాన గల శ్రీకృష్ణ చైతన్య మఠంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం, ప్రత్యేక అర్చ నలు, అభిషేకాలు, విశేష పూజలు జరపనున్నారు. అలాగే నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉట్టి సంబరం నిర్వహించేందుకు యువతీ యువకులు సిద్ధమయ్యారు.

అలరించిన చిన్నారుల వేషధారణలు



తమ వేషదారణతో అలరించిన చిన్నారులు

మహారాణిపేట: ప్రకృతి చికిత్సాలయంలో ఆదివారం శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని చిన్నారులు వేసిన శ్రీకృష్ణుడు, గోపిక, రాధ వేషధారణలు అలరించాయి. శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ఆధ్వర్యంలో జయంతి ఫణి కాత్య, శిష్టా సాయి పూజిత, క్షీరాబ్ది దుతి, మల్లవరపు సాయి, ఆముక్త పలు వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్. శ్రీలక్ష్మి, డాక్టర్ లక్ష్మీనారాయణ, జయంతి శేష అన్నపూర్ణ, వై.లక్ష్మణరావు, రమణమ్మ, వై.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలిపై దాష్టీకం దారుణం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, ఉపాధ్యాయులు, పౌరులు

సీతమ్మధార: కోల్‌కతా వైద్యురాలిపై జరిగిన దారుణ కృత్యాన్ని వ్యతిరేకిస్తూ పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రజా సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాష్టీకాలను ఖండించాలన్నారు. నేరస్తులకు శిక్షలు పడే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పౌర చైతన్య వేదిక నాయకులు సి.హెచ్. ప్రమీల అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు చరిత్ర పరిశోధకులు పడాల వీరభద్రరావు, ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర సలహాదారులు డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యులు కోలవెన్ను, డాక్టర్ వెంకట రమణ, సత్యవతి, పొన్నాడ శ్రీనివాసరావు, ధర్మేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటిపై ఒత్తిడి తగ్గించాలి



శిబిరంలో కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

మురళీనగర్: జ్ఞానేంద్రియాల్లో అతి ముఖ్యమైన కంటిపై ఒత్తిడి తగ్గించాలని శంకర్ ఫౌండేషన్ వైద్యులు డాక్టర్ శశి, సమృద్ధి, ఆర్.దేశ్‌ముఖ్ సూచించారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో శంకర్ ఫౌండేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో వారు మాట్లాడారు. ఏడాదికోసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా 174 మందికి వైద్య పరీక్షలు చేయగా వారిలో 36 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని సిఫారసు చేశారు. అనంతరం వైద్యులను వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, పి.చెల్వరాజు, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, ఆర్.సత్యనాథం, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.